
సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 17 । జూన్ । 2023



చిన్నారి పెళ్లికూతుళ్లు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అవగాహన లోపంతో ఇప్పటికీ అక్కడక్కడ జరుగుతున్న బాల్య వివాహాలకు అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు. - 8లో▸



డెల్టాలకు 6,135 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1,700, మధ్య డెల్టాకు 1,225, పశ్చిమ డెల్టాకు 3,210 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
48.5°/28.1°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	48.5	29.5
కాకినాడ	43.9	28.1
అమలాపురం	46.0	30.0

న్యూస్‌రీల్

సూర్యదేవాలయానికి రూ.2.50 లక్షల విరాళం



సమితి సభ్యులకు చెక్కు అందజేస్తున్న దాతలు

గోకవరం: గోకవరంలో సనాతన ధర్మ ప్రభోధనా సమితి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీస్కంద బాలాజీ సూర్యదేవాలయానికి గ్రామానికి చెందిన తోట రత్నం, రాంబాబు దంపతుల కుమారులు రూ.2.50 లక్షల విరాళం అందించారు. స్థలదాతలు అక్షింతల రాజా, రాణి దంపతుల సహకారంతో గ్రామ శివారున సూర్యదేవాలయం నిర్మిస్తున్నారు. ఈ ఆలయానికి తోట త్రిమూర్తులు, తోట నాని తమ తల్లిదండ్రుల పేరుపై రూ.2.50 లక్షల చెక్కును శుక్రవారం సమితి అధ్యక్షుడు తోట సాయిబాబు, ప్రధాన కార్యదర్శి అక్షింతల రాజాలకు అందజేశారు. సమితి సభ్యులు కొరిపల్లి అప్పలస్వామి, పిల్లంగోరు పాపారావు, దోసపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

నన్నయ అభివృద్ధికి తోడ్పడండి



వీసీ ఆచార్య పద్మరాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అలూమ్ని సభ్యులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీని అన్ని విధాల అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు అందరి తోడ్పాటు అవసరమని వీసీ ఆచార్య కె. పద్మరాజు అన్నారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత యూనివర్సిటీ అలూమ్ని అసోసియేషన్ (పూర్వ విద్యార్థులు) సభ్యులు శుక్రవారం ఆయనను కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీసీ వారినుద్దేశించి మాట్లాడుతూ గోదావరి జిల్లాల వాసుల చిరకాల వాంఛ మేరకు ఈ ప్రాంతాలలోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పడిన యూనివర్సిటీని ఉన్నత స్థానానికి తీసుకువెళ్లవలసిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. యూనివర్సిటీ అభివృద్ధిలో అలూమ్ని పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. వీసీని కలిసిన అలూమ్ని సభ్యులలో గాదె కిషోర్, సుంకర నాగేంద్ర, డాక్టర్ ఎం. కమలా కుమారి, ఆచార్య డి. జ్యోతిర్మయి, ఆనంద్, డాక్టర్ ఎం. శ్రీరామరాజు ఉన్నారు.

మానవహక్కుల సంఘం చొరవ
స్వస్థలం చేరుకున్న బాధితురాలు

సామర్లకోట: జిల్లా మానవహక్కుల సంఘం జోక్యంతో ఒక మహిళ బెహరైన్ నుంచి క్షేమంగా స్వగ్రామం చేరింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన బాధితురాలు రాపాక సుమ ఆ విషయాలను విలేకర్లకు తెలిపింది. బెహరైన్‌లో ఉపాధి కోసం ఏడాది క్రితం ఏజెంట్ ద్వారా ఆమె దుబాయి వెళ్లింది. మూడు నెలలు పని చేసిన తరువాత ఆమెను మూడు కుటుంబాల వారు వేధించేవారు. ఆ విషయాన్ని సుమ భర్తకు తెలిపింది. దాంతో సామర్లకోట మానవహక్కుల సంఘ నాయకులు ఇటువంటి సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలుసుకుని సంప్రదించారు. సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, మానవ హక్కుల సంఘ ఇంటర్నేషనల్ అధికార ప్రతినిధి పిట్ల అప్పారావుకు పరిస్థితిని వివరించారు. దుబాయిలో ఉన్న మానవహక్కుల సంఘ సభ్యుల సహకారంతో రాపాక సుమను దుబాయి నుంచి క్షేమంగా దేశానికి తీసువచ్చే ఏర్పాటు చేశారు. సుమ శుక్రవారం మానవహక్కుల సంఘ నాయకులను కలసి కృతజ్ఞతలు తెలిపింది.

19న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 19న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఇన్నిస్ సిస్టమ్ ఐఎన్‌సీ కంపెనీలో యూఎస్ ఐటీ రిక్రూట్‌మెంట్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఓపీటీ రిక్రూటర్స్, యాక్సిస్ బ్యాంక్‌లో బీడీఈ, అసిస్టెంట్ మేనేజర్, జియో ఫైబర్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, నిట్(ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్ షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, ఇసుజు మోటార్స్, డిక్సాన్ అండ్ సియాన్, ఇ-హెచ్‌డబ్ల్యూఏ సుమిత్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. పై ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.11 వేల నుంచి రూ.25 వేలు వరకు జీతం, ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈనెల 19న ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్ద సర్టిఫికెట్ల జిరాక్సులతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పీడీ కోరారు.

పక్కాగా.. చకచకా

- గ్రామ స్వరాజ్యం దిశగా ప్రభుత్వం అడుగులు
- వేగవంతంగా ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులు
- అందుబాటులో సచివాలయం, ఆర్బీకే, డిజిటల్ లైబ్రరీ, వెల్‌నెస్, బల్క్ మిల్క్ కలెక్షన్ సెంటర్లు
- రూ.315.65 కోట్లతో చురుగ్గా నిర్మాణ పనులు



కార్పొరేట్ భవనాన్ని తలపిస్తున్న నిడదవోలు మండలం సింగవరం గ్రామ సచివాలయం

సాక్షి, రాజమహేంద్రవరం: గ్రామ స్వరాజ్యం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ గ్రామీణ వైద్య శాలలు, డిజిటల్ లైబ్రరీ, పాల సేకరణ కేంద్రాల నిర్మాణానికి నాంది పలికింది. జిల్లా వ్యాప్తంగా రూ.315.65 కోట్లతో 1276 పక్కా భవనాల నిర్మాణ పనులు చేపడుతోంది. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని భవన నిర్మాణ పనులు పూర్తవ్వగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయి.

జిల్లాలో ఇలా..

ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు శాశ్వత భవనాలు ఉండాలన్న తలంపుతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గ్రామీణ ప్రాంత అభివృద్ధి ముడిపడి ఉన్న శాఖలకు చెందిన ఐదు రకాల (గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లు, బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీ) కార్యాలయాలకు సొంత భవనాలను సమకూర్చుతోంది. ఇందుకోసం జిల్లాలో 1,276 భవన నిర్మాణాలకు రూ.315 కోట్లు విడుదల చేసింది. 312 భవనాల నిర్మాణం పూర్తయింది. ఇవి ఇప్పటికే ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. మిగిలినవి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామ సచివాలయ భవన నిర్మాణాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అవసరమైన అన్ని రకాల వసతులతో వీటిని నిర్మిస్తోంది. రూ.150.20 కోట్ల వ్యయంతో 390 భవనాలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకూ 152 భవనాల పనులు పూర్తయ్యాయి. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి.

రైతుల సేవలో ఆర్బీకేలు

రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం ఆర్బీకే(రైతు భరోసా కేంద్రాలు)లు అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలో వీటికోసం 373 భవన నిర్మాణాలను నిర్మిస్తున్నారు. రూ.81.02 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే 99 భవనాల నిర్మాణం పూర్తయ్యాయి. రైతులకు సేవలు అందిస్తున్నాయి.

బల్క్‌మిల్క్ కేంద్రాలు

పాడి రైతులకు ప్రోత్సాహం అందించే క్రమంలో గ్రామాల్లో ప్రభుత్వం బల్క్ మిల్క్ కేంద్రాలు (పాల శీతలీకరణ కేంద్రం) అందుబాటులోకి తెస్తోంది. నేరుగా రైతే కేంద్రంలో పాలు విక్రయించడంతో మంచి ధర లభిస్తోంది. ప్రభుత్వ ప్రయోజనాలన్నీ పొందే వీలు కలుగుతోంది. ఇందుకోసం రూ.10.60 కోట్లతో 75 భవనాలు నిర్మిస్తున్నారు. 71 భవనాల పనులు పునాది దశలో ఉన్నాయి.

వెల్‌నెస్ సెంటర్‌తో మెరుగైన వైద్యం

గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్షణం మెరుగైన వైద్యం అందించే ఉద్దేశంతో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ (వెల్‌నెస్ సెంటర్స్)ల నిర్మాణాన్ని ప్రభుత్వం తలపెట్టింది. జిల్లా వ్యాప్తంగా 338 సెంటర్లు మంజూరయ్యాయి. వీటి భవనాల నిర్మాణానికి రూ.57.83 కోట్లు వెచ్చించనున్నారు. 61 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి.

నియోజకవర్గాల వారీగా భవనాల నిర్మాణ వ్యయం (రూ.కోట్లల్లో)

నియోజకవర్గం	భవనాలు	నిధులు
రాజానగరం	284	66.12
గోపాలపురం	208	51.20
కొవ్వూరు	165	41.65
అనపర్తి	179	45.24
నిడదవోలు	191	48.47
రాజమండ్రి రూరల్	185	46.48
జగ్గంపేట	64	16.47

విజ్ఞానానికి డిజిటల్ హంగులు

గ్రామీణ విద్యార్థులు, పాఠకులకు అత్యాధునిక వసతులతో సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచేందుకు డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి నాంది పలికింది. అందుకు పక్కా భవనాలకు రూ.16 కోట్లు మంజూరు చేయగా 100 భవనాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. వంద భవన పనులు ప్రారంభ దశలో ఉన్నాయి.

ప్రాధాన్యత భవనాలపై ప్రత్యేక దృష్టి



ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాం. క్షేత్ర స్థాయి నుంచి వచ్చిన ప్రతిపాదనలకు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నాం. భవన నిర్మాణం పనులు సత్వరం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సింహభాగం పనులు పూర్తయ్యాయి. భవనాలు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం.

– కె.మాధవీలత, కలెక్టర్



చాగల్లు మండలం ఊనగట్లలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్



రంగంపేట మండలంలో విలేజ్ క్లినిక్

నేటి నుంచి 'జగనన్న సురక్ష'పై శిక్షణ

- ఈ నెల 23 నుంచి జూలై 23 వరకూ గ్రామసభలు
- అధికారులతో కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో జేసీ తేజ్‌భరత్, కమిషనర్ దినేష్ కుమార్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జగనన్న సురక్ష కింద నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ మాధవీలత అధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, అధికారులు, గృహసారథులు జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. ఇందుకోసం క్షేత్రస్థాయి సిబ్బందికి మండల పరిధిలో శనివారం నుంచి ఈనెల 20 వరకూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జూన్ 23 నుంచి జూలై 23 వరకూ జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గ్రామ సభలను మంగళ, గురు, శుక్రవారాల్లో నిర్వహించాలన్నారు. సచివాలయాల ద్వారా 534 సేవలు అందించడం జరుగుతోందని, ఆ మేరకు అర్జీల స్వీకరణ చేపట్టి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్యలు చేపట్టాలన్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాలు, పథకాలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, పరిష్కరించాలన్నారు. ఇందుకోసం మండల స్థాయిలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్‌తో ఒక బృందం, తహసీల్దార్, పంచాయతీరాజ్ ఈఈతో మరో బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో కార్పొరేషన్ కమిషనర్, సిబ్బంది ఒక బృందంలో, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, సిబ్బంది మరో బృందంలో సభ్యులుగా ఉంటారన్నారు. ఈ బృందాలు ఆయా వార్డులను సందర్శించి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి మరిడమ్మ జాతర

- జూలై 24 వరకు ఉత్సవాల నిర్వహణ
- దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు
- ఆషాఢమాసమంతా పోటెత్తనున్న భక్తులు



పట్టణంలో ఊరేగుతున్న మరిడమ్మ అమ్మవారి గరగ (ఫైల్)



కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం రాత్రి నుంచి వైభవోపేతంగా నిర్వహించనున్నారు. రెండేళ్లుగా కరోనా నేపథ్యంలో ఈ ఉత్సవాలను ఏకాంతంగా నిర్వహించారు. జూలై 24 వరకు 37 రోజుల పాటు వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు.

చింతపల్లి వారి ఆడపడుచుగా

భక్తులు అమితంగా ఆరాధించే మరిడమ్మ అమ్మవారు సామర్లకోట చింతపల్లి వారి ఆడపడుచు. ఇప్పటికీ ఆ వారసులే ఇక్కడ ట్రస్టీలుగా వ్యవహరిస్తున్నారు. వారి కులదేవతగా పెద్దాపురంలో వెలసినట్లు భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఏటా ఆషాఢ మాసంలో 37 రోజుల పాటు జాతర జరపడం ఆనవాయితీగా వస్తోంది. కరోనా తర్వాత తొలిసారిగా జాతర నిర్వహిస్తున్నారు.

పట్టణ వీధుల్లో గరగ ఊరేగింపు

ఆషాఢమాసంలో అమ్మవారి జాతరకు ఉన్న ప్రత్యేకతతో పాటు గరగకు విశిష్ట పూజలు నిర్వహిస్తారు. జాతర ఆరంభానికి ముందు తొలి గరగను ఊరేగించడం ఆనవాయితీ. పురవీధుల్లో డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారి గరగను ఊరేగిస్తుంటే భక్తిపారవశ్యులవుతారు. అమ్మవారికి పాన్పు, చీరలు సమర్పించేందుకు, ముడుపులు, మొక్కులు తీర్చుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు గంటల తరబడి నిరీక్షిస్తారు. పెద్దాపురంలో వారానికి ఒక వీధి వంతున అమ్మవారి సంబరాలను నిర్వహించడం ఆనవాయితీ. పోటాపోటీగా లక్షల రూపాయలు వెచ్చించి ఘనంగా నిర్వహిస్తుంటారు. వీధి సంబరాల నిర్వహణకు ఇప్పటికే కమిటీలు సమాయత్తమయ్యాయి.

నేడు జాగరణ మహోత్సవం

మరిడమ్మ అమ్మవారి జాగరణ మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా శ్రీకారం చుట్టుకోనుంది. ఎంపీ వంగా గీత, దేవదాయ శాఖ అతాధికారులు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మితో పాటు ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వి రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ఆసాదుల, వేదపండితులతో అమ్మవారి జాతర ఉత్సవం నిర్వహిస్తారు.

మొక్కుబడులకు అనుమతి



కోవిడ్ నిబంధనల సడలింపు నేపథ్యంలో ఈ ఏడాది అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకోవచ్చు. ప్రతీ రోజు అమ్మవారికి దీప ధూప నైవేద్యం, గరగ, జాతర ఉత్సవాలు ఉంటాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి కృపను పొందుతారని ఆశిస్తున్నాం..

– సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్

ఎప్పటికప్పుడు క్లయిమ్‌ల పరిష్కారం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించిన క్లయిమ్‌లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి మాధవీలత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 15,52,268 ఓటర్లు ఉన్నారన్నారు. జనవరి 6 నుంచి మే 31 వరకూ 6,743 మందికి ఓటు హక్కు కల్పించగా, చిరునామా మారడం, మృతి చెందడం తదితర కారణాలతో 11,410 మందిని తొలగించామన్నారు. ఫారం-6కు సంబంధించి 6,728 దరఖాస్తులకుగాను 5,202 ఆమోదించి, 518 తిరస్కరించామన్నారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకూ బూత్ స్థాయి అధికారులు ఇంటింటా సర్వే చేయాలన్నారు. ఓటర్ల నమోదు, హేతుబద్ధీకరణ తదితర ప్రక్రియను ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకూ నిర్వహించాలన్నారు.సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గోడౌన్ పరిశీలన

జిల్లాకు చెందిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్ర పరికరాలు భద్రపర్చడానికి అనువుగా ఉండే గోడౌన్‌ను గుర్తించామని కలెక్టర్ మాధవీలత అన్నారు. ఆమె శుక్రవారం లాలాచెరువు సమీపంలోని ఎఫ్‌సీఐ వేర్ హౌసింగ్ గోడౌన్‌ను జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, డీఆర్వో జి.నరసింహులు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఎస్‌బీవీ రెడ్డి, డీఈ బీవీవీ మధుసూదనరావుతో కలిసి పరిశీలించారు. అక్కడ చేయాల్సిన ఏర్పాట్లు, చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.

'బంగారుకొండ'ను విజయవంతం చేయాలి

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బంగారుకొండ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. బంగారుకొండ వెబ్‌సైట్, యాప్ వినియోగంపై ఐసీడీఎస్ పీడీ విజయ కుమారి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ బంగారుకొండ ద్వారా బలహీనంగా, వయసుకు తగిన ఎత్తు, బరువుకు తగిన ఎత్తు లేని పిల్లలను ఇప్పటికే గుర్తించామన్నారు. వారి విషయంలో బాలమిత్రలు తీసుకునే వ్యక్తిగత శ్రద్ధ చాలా కీలకమన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న సంపూర్ణ పోషణ విధానంలో ఇంకా ఎక్కువ స్థాయిలో పౌష్టికాహారం అవసరాన్ని గుర్తించి జిల్లాలో బంగారుకొండను రూపొందించామన్నారు. ఐసీడీఎస్ పీడీ విజయ కుమారి మాట్లాడుతూ జూన్ 19 నాటికి మండల కేంద్రాలకు కిట్లు పంపిణీ చేయడం, శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. జూన్ 20 నుంచి కిట్లు అందజేసి, వాటి వివరాలను పోర్టల్, యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆమె సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూన్‌లోనూ తగ్గేదేలే..



- కొనసాగుతున్న భానుడి విశ్వరూపం
- రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- సాధారణం కంటే 6 నుంచి 8 డిగ్రీల నమోదు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): భానుడి ప్రతాపానికి జిల్లా వాసులు అల్లాడిపోతున్నారు. జూన్‌లో కూడా రోజురోజుకి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. వేడికి తాళలేక ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 45 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు రావడంతో జనం బెంబేలెత్తుతున్నారు. సాధారణం కంటే 6 నుంచి 8 డిగ్రీలు అధికంగా నమోదు అవుతున్నాయి. పగటి వేళ సూర్యుడు ప్రతాపం చూపడంతో రాత్రి 11 గంటలకు కూడా వేడి గాలులు వీస్తున్నాయి.

రోడ్లన్నీ నిర్మానుష్యం

ఉదయం నుంచే వేడి గాలులు ప్రారంభమవుతున్నాయి. మధ్యాహ్నానికి ఎండ తీవ్రరూపం దాల్చుతోంది. ప్రజలందరూ దాదాపు ఇళ్లకే పరిమితమవుతున్నారు. జనసంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. చిరు వ్యాపారస్తులు సైతం ఉదయమే వ్యాపారం మొదలుపెట్టి మధ్యాహ్నానికి ముగించేస్తున్నారు. గత వారం రోజులుగా 45 డిగ్రీలకు తగ్గకుండా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణంగా మేలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. జూన్ మొదటి వారంలో వర్షాలు పడటంతో తగ్గుముఖం పడతాయి. కానీ ఈ ఏడాది జూన్ రెండో వారంలోనూ వర్షాలు జాడ కానరాలేదు. దీంతో భానుడు భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో ఏసీలు, రిఫ్రిజరేటర్ల వినియోగం ఎక్కువైంది. దీంతో విద్యుత్ వాడకం బాగా పెరిగిపోయింది.

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు

తేదీ	ఉష్ణోగ్రత (డిగ్రీలలో)
16-06-25	48.5
15-06-26	44.0
14-06-23	46.5
13-05-23	44.0
12-06-25	45.0
11-06-25	45.5
10-06-25	45.5

పచ్చదనం మాయం



దాదాపు 30 ఏళ్ల క్రితం రాజమహేంద్రవరం చెట్లతో నిండి ఉండేది. ఎక్కడ చూసినా పచ్చదనం ఆహ్లాదపరిచేది. రోడ్లకు ఇరువైపులా చెట్లు ఉండేవి. సాయంత్రం పూట గోదావరి గట్టు వద్దకు వెళితే చల్లగాలులు వీచేవి. కానీ ఇప్పుడు నగరంలో చెట్లు కనుమరుగయ్యాయి. దీంతో ఎండ తీవ్రత పెరిగిపోయింది.

– శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర, సీనియర్ సిటిజన్

మొక్కలు పెంచాలి



ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణ రక్షణకు కృషి చేయాలి. మొక్కలు పెరిగితే నీడతో పాటు ఆక్సిజన్‌ను అందిస్తాయి. నేటి పరిస్థితులు ఇలాగే కొనసాగితే ముమ్ముందు ఇంకా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఇంటి చుట్టూ పచ్చని మొక్కలు పెంచడం వల్ల ఎండ నుంచి రక్షణ పొందవచ్చు.

– సొనబోయిన రామారావు, సీనియర్ సిటిజన్



హైటెక్ బస్సుషెల్టర్‌లో కనిపించని ప్రయాణికుల రద్దీ



నిర్మానుష్యంగా మారిన కంబాలచెరువు సెంటర్



రాజమహేంద్రవరంలోని దేవీచౌక్ ప్రాంతం

క్లుప్తంగా

గుడ్డిగూడెం వద్ద 'పుష్ప-2'



పోలవరం కుడి ప్రధాన కాలువలో చిత్రీకరిస్తున్న ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా సన్నివేశం

దేవరపల్లి: తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం గుడ్డిగూడెం వద్ద సినిమా షూటింగ్ సందడి నెలకొంది. సుకుమార్ దర్శకత్వంలో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నిర్మిస్తున్న 'పుష్ప–2' సినిమా షూటింగ్ మూడు రోజులుగా ఇక్కడ జరుగుతోంది. చిత్రంలోని పలు కీలక సన్నివేశాలను ఇక్కడ తీస్తున్నారు.

ముఖ్యంగా పోలవరం కుడి ప్రధాన కాలువలో ఎర్రచందనం స్మగ్లింగ్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ గ్రామం పోలవరానికి సమీపంలో ఉండటంతో ఇక్కడ అటవీ ప్రాంతంతో పాటు అందమైన లొకేషన్లు ఉన్నాయి. దీంతో ఈ సినిమా షూటింగ్‌కు ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారు.

కేరళ సహకార బ్యాంకును సందర్శించిన ఆకుల



కేరళ కో ఆపరేటివ్ ఎపెక్స్ బ్యాంకు వద్ద డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కేరళ రాష్ట్రంలోని కో ఆపరేటివ్ ఎపెక్స్ బ్యాంకును ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు, ఆప్కాబ్ చైర్మన్, ఇతర డీసీసీబీల చైర్మన్లు, అధికారులతో కలిసి శుక్రవారం సందర్శించారు. సొసైటీల అభివృద్ధికి కేరళ కో ఆపరేటివ్ ఎపెక్స్ బ్యాంకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. ఆ విధానాన్ని మన రాష్ట్రంలోని సొసైటీల్లో అమలు చేసేందుకు ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి ఆధ్వర్యాన చైర్మన్లు, అధికారులు కేరళ కో ఆపరేటివ్ ఎపెక్స్ బ్యాంక్ ఆహ్వానం మేరకు అక్కడకు వెళ్లి, అధ్యయనం చేశామని ఆకుల వీర్రాజు విలేకర్లకు తెలిపారు.

చిన్నారి పెళ్లికూతుళ్లు



- పసి మొగ్గల భవితకు **మూడు 'ముళ్లు'**
- బాల్య వివాహాలతో **ఎన్నో అనర్థాలు**
- గుట్టుచప్పుడు కాకుండా అక్కడక్కడ పెళ్లిళ్లు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో నాలుగున్నరేళ్లుగా 436 వివాహాలకు అడ్డుకట్ట

నాలుగున్నరేళ్లుగా ఉమ్మడి జిల్లాలో నిలిపిన బాల్య వివాహాలు

సంవత్సరం	గుర్తించినవి	నిలిపినవి
2019	149	149
2020	107	107
2021	34	34
2022	89	89
2023 (ఇప్పటి వరకూ)	57	57

రాయవరం: ఓపక్క పెళ్లి బాజాలు మోగుతున్నాయి. వధూవరులు మండపానికి వచ్చేశారు. ఇంకోపక్క బంధువులందరూ విందు భోజనాలు చేస్తున్నారు. ఎవరు సమాచారం ఇచ్చారో కానీ.. ఐసీడీఎస్, పోలీసు, రెవెన్యూ అధికారులు పెళ్లి మండపానికి వచ్చారు. పెళ్లి కుమార్తెకు 18 ఏళ్లు నిండలేదని, బాల్య వివాహ చట్టం ప్రకారం ఈ వివాహం నేరమని తల్లిదండ్రులకు వివరించారు. దీనివలన కలిగే అనర్థాలను వివరించి, వివాహాన్ని ఆపాలని సూచించారు. ఇక్కడి వరకూ వచ్చాక ఇప్పుడు పెళ్లి ఎలా ఆపుతామంటూ అధికారులతో చిన్నారి పెళ్లికూతురి తల్లిదండ్రులు, బంధువులు వాగ్వాదానికి దిగారు. చివరకు అధికారుల జోక్యంతో ఆ బాల్య వివాహానికి బ్రేక్ పడింది. ఇటువంటి సంఘటనలు ఇప్పటికీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అడపాదడపా కనిపిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా కోరుకొండ, ఆత్రేయపురం, పెద్దాపురం, పెదపూడి, శంఖవరం, కాట్రేనికోన, రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట తదితర మండలాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నట్టు చైల్డ్‌లైన్‌కు వస్తున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

ఎన్నో అనర్థాలు

తల్లిదండ్రుల్లో అవగాహనా లోపం, సామాజిక పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, ప్రేమ వ్యవహారాలు, దగ్గరి బంధుత్వాల వంటి కారణాలతోనే ఇప్పటికీ కొన్నిచోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించారు. ఎదిగీ ఎదగని వయస్సులో చిన్నారుల మెడలో పడే మూడు ముళ్లు ఎన్నో పీటముడులకు కారణమవుతాయి. పద్దెనిమిదేళ్లలోపు వయసులో పెళ్లయితే పుస్తకాలు పక్కన పెట్టి కుటుంబ బాధ్యతలు మోయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పెన్ను పట్టాల్సిన చేయి వంట గదిలో గరిటె తిప్పాల్సి వస్తోంది. బాల్యంలోనే వివాహమైన అమ్మాయిలకు జీవితాంతం ఇబ్బందులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో వారు తీవ్ర ఇబ్బందులు పడతారని, రోగాలు వెన్నాడే ప్రమాదముంటుందని గైనకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. చిన్న వయస్సులో వివాహాలు జరిగిన వారికి రక్తహీనత సమస్య తీవ్రంగా ఉంటుంది. పుట్టే బిడ్డల్లో ఎదుగుదల తక్కువగా ఉంటుంది. శారీరకంగా, మానసికంగా సమస్యలు ఎదురవుతాయి. ఎదగాల్సిన సమయంలో కడుపులో బిడ్డను మోయాల్సి రావడం ఆ బాలిక ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది.

నిరంతర పర్యవేక్షణతో..

ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నా ఎక్కడో ఒకచోట అనర్థాలు జరిగిపోతూనే ఉన్నాయి. దీనిని అడ్డుకునేందుకు ఆయా జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. తల్లిదండ్రుల్లో చైతన్యం పెంచేందుకు ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో పదో తరగతి పూర్తయిన తర్వాత ఆ బాలికలు ఇంటర్, ఇతరత్రా కోర్సుల్లో చేరారా, లేదా అనే విషయంపై విద్యా శాఖ కూడా దృష్టి సారిస్తోంది. అధికారుల నిరంతర పర్యవేక్షణతో బాల్య వివాహాలకు క్రమంగా అడ్డుకట్ట పడుతోంది. గడచిన ఐదేళ్లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 436 బాల్య వివాహాలను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు అడ్డుకున్నారు.



బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిరంతరం అవగాహన



బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, బాలల సంరక్షణ సమితి సిబ్బందితో ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు బాధ్యతగా ఉంటే పరిస్థితిలో స్పష్టమైన మార్పు వస్తుంది.

– గుత్తుల సత్యవాణి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి, అమలాపురం

అన్ని శాఖల సమన్వయంతో..



స్త్రీ, శిశు సంక్షేమం, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యాశాఖల సంయుక్త సహకారంతో మంచి ఫలితాలు వస్తాయి. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై విద్యార్థి దశ నుంచే విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. గతంతో పోలిస్తే ఇప్పుడు తల్లిదండ్రుల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

– సీహెచ్ వెంకటరావు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి, కాకినాడ

హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలి

బాల్య వివాహాలు నేరం. ఇవి జరిగితే క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ ఎవ్వరికైనా సమాచారం ఇవ్వవచ్చు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ 100, చైల్డ్‌లైన్ 1098, హెల్ప్‌లైన్ 181 నంబర్లతో పాటు తహసీల్దార్, ఐసీడీఎస్ సీడీపీఓ, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి (జీఎంఎస్‌కే), వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లకు సమాచారం ఇవ్వవచ్చు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతారు.

చట్టాలు ఏం చెబుతున్నాయంటే..

1929లోనే బాల్య వివాహాల నిరోధక చట్టం తీసుకువచ్చారు. దీనిలో శిక్షలు తక్కువగా ఉండటంతో ఈ చట్టంలో మార్పులు, చేర్పులు చేసి 2006లో సంపూర్ణంగా అమలులోకి తీసుకువచ్చారు. 2007 నవంబర్ నుంచి దీని అమలు ప్రారంభమైంది. సమాజంలో యువతీ యువకులు యుక్త వయస్సు వచ్చాక వారి జీవిత భాగస్వాములను స్వేచ్ఛగా ఎంపిక చేసుకునే అవకాశం ఇవ్వాలని ఈ చట్టంలో పేర్కొన్నారు. అంతకన్నా తక్కువ వయసు ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు తప్పనిసరి చేశారు. దీనిని అతిక్రమిస్తే రెండేళ్ల జైలు, రూ.లక్ష వరకూ జరిమానా విధించే అవకాశముంది. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారికి కూడా శిక్షలు తప్పవు.

హోటళ్లు, రెస్టారెంట్లపై విజిలెన్స్ దాడులు



గ్రీన్ ట్రీ హోటల్‌లో నిల్వ మాంసాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ ముత్యాల నాయుడు, సీఐ సత్యకిషోర్

అమలాపురం టౌన్: పట్టణంలోని గ్రీన్ ట్రీ ఎన్వీ, శ్రీదేవి బార్ అండ్ రెస్టారెంట్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు – కొలతలు, ఫుడ్ కంట్రోల్, వార్డు సచివాలయాల పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులతో కూడిన అధికారుల బృందం శుక్రవారం ఆకస్మికంగా దాడులు చేసింది. విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆధ్వర్యాన డీఎస్పీ ముత్యాల నాయుడు పర్యవేక్షణలో సీఐ వై.సత్యకిషోర్ ఈ దాడులు నిర్వహించారు. గ్రీన్ ట్రీ హోటల్‌లో ముందు రోజు మాంసాన్ని నిల్వ ఉంచడాన్ని గుర్తించారు. పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నట్టు గమనించారు. నిల్వ మాంసాన్ని సీజ్ చేశారు. హోటల్‌లో ప్లాస్టిక్ కవర్లు ఎక్కువగా వాడుతున్నట్టు గుర్తించిన వార్డు సచివాలయ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి బండి వీరన్న.. హోటల్ యాజమానికి రూ.7,500 జరిమానా విధించారు. అలాగే శ్రీదేవి బార్ అండ్ రెస్టారెంట్‌లో వేయింగ్ మెషీన్(కాటా)కు అధికారిక సీళ్లు లేకపోవడం, మద్యం పోసే పెగ్గులు సక్రమంగా లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. కాటా, పెగ్గులను సీజ్ చేశారు. రెస్టారెంట్‌లో ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉండటంతో పాటు కుకింగ్ రూమ్‌లో పరిశుభ్రత లేదని గుర్తించిన వార్డు సచివాలయ అధికారులు ఆ రెస్టారెంట్ యజమానికి రూ.15 వేల జరిమానా విధించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏఓ భార్గవ్ మహేష్, ఫుడ్ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేష్, తూనికలు – కొలతల అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. గ్రీన్ ట్రీ హోటల్, శ్రీదేవి బార్ అండ్ రెస్టారెంట్లపై కేసులు నమోదు చేశామని విజిలెన్స్ సీఐ సత్యకిషోర్ తెలిపారు.

ఇతర వాణిజ్య పంటల పైనా పరిశోధనలు చేపట్టాలి

- ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సింగ్
- సీటీఆర్ఐలో ముగిసిన పరిశోధన సలహా కమిటీ సమావేశాలు



సమావేశాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ హెచ్ఎస్ గుప్తా. చిత్రంలో డాక్టర్ ఆర్‌కే సింగ్ తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకుతో పాటు ముఖ్యమైన వాణిజ్య పంటలపై కూడా పరిశోధనలు చేపట్టాలని ఢిల్లీకి చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) కమర్షియల్ క్రాప్స్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌కే సింగ్ శాస్త్రవేత్తలకు సూచించారు. రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ(సీటీఆర్ఐ)లో పరిశోధన సలహా కమిటీ సమావేశాలు రెండు రోజుల పాటు నిర్వహించారు. రెండో రోజైన శుక్రవారం సీటీఆర్ఐ సెమినార్ హాలులో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ఐసీఏఆర్ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ అగ్రికల్చర్ (ఎన్ఐఆర్‌సీఏ) ద్వారా ఈ పరిశోధనలు సాగించాలన్నారు. పరిశోధన సలహా కమిటీ చైర్మన్‌గా న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా పని చేసి, అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్న శాస్త్రవేత్త డాక్టర్ హెచ్ఎస్ గుప్తా వ్యవహరిస్తున్నారు. ఈ కమిటీలో ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ కేవీ భట్, డాక్టర్ విలాస్ తోనపి, డాక్టర్ కేపీ పటేల్, డాక్టర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, రైతులు పొట్లూరి రామ్మోహనరావు, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు. వీరందరూ ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

గత ఏడాది సీటీఆర్ఐ పరిశోధన స్థానాల ప్రాజెక్టులు, వాటి ఫలితాలు, పొగాకు సాగులో ఎదురవుతున్న సమస్యలు, నివారణ చర్యలు, పొగాకు ద్వారా అత్యున్నత ఆర్థిక ప్రగతి సాధనలో శాస్త్రవేత్తల కృషిని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ వివరించారు. పొగాకుతో పాటు పసుపు, మిరప, ఆముదం, అశ్వగంధ పంటలపై పరిశోధనలకు కార్యాచరణ ప్రణాళిక, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో సమన్వయం తదితర అంశాలను వివరించారు. అనంతరం సీటీఆర్ఐ ప్రాంతీయ పరిశోధన సంస్థల ప్రజెంటేషన్లను విభాగాలు వారీగా ప్రధాన శాస్త్రవేత్తలు సమర్పించారు. పరిశోధన పరిశీలన కమిటీ శాస్త్రవేత్తలకు అనేక సలహాలు ఇచ్చారు. కమిటీ చైర్మన్ డాక్టర్ గుప్తా మాట్లాడుతూ, శాస్త్రీయ పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులను ఆహ్వానించాలని సూచించారు. పొగాకుతో పాటు పసుపు, మిరప, ఆముదం, అశ్వగంధ తదితర వాణిజ్య పంటలపై కూడా విస్తృత పరిశోధనలు చేపట్టాలని అన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

జగ్గంపేట: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో గత ఫిబ్రవరిలో పట్టుబడిన గంజాయి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఘంటసాల దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు సీఐ సూర్య అప్పారావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గత ఫిబ్రవరి 27న విశాఖపట్నం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు లారీలో తరలిస్తున్న గంజాయిని జగ్గంపేట మండలం రామవరంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కొంతమంది నిందితులను అప్పట్లో అరెస్టు చేశారు. వారికి 320 కిలోల గంజాయిని విక్రయించిన ఘంటసాల దుర్గాప్రసాద్ ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్నాడు. అప్పటి నుంచీ తప్పించుకుని తిరుగుతున్న అతడిపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో జగ్గంపేట సర్కిల్ కార్యాలయంలో దుర్గాప్రసాద్ శుక్రవారం సరెండర్ అయ్యాడు. అతడిని సీఐ సూర్య అప్పారావు అరెస్టు చేశారు. నిందితుడు అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బీపీ పట్నానికి చెందిన వాడని సీఐ తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో లారీ డ్రైవర్ తంగయ్య, గంజాయి కొనుగోలు చేసిన ఎస్.గౌతమ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ వివరించారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొవ్వూరు: పట్టణంలోని గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మృతుడికి సంబంధించిన ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహం స్థితిని బట్టి అతడు ఈ రోజే మరణించి ఉండవచ్చని పట్టణ పోలీసులు భావిస్తున్నారు. స్నానానికి నదిలోకి దిగి ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రత్నగిరిపై నేటి నుంచి వరుణ జపాలు

అన్నవరం: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ సత్యదేవుని సన్నిధిలో ఐదు రోజుల పాటు వరుణ జపాలు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 7.30 గంటలకు దర్బారు మండపంలో స్వామివారి ఉత్సవమూర్తుల వద్ద పండితులు ఋష్యశృంగ మహర్షి విగ్రహానికి పూజలు చేసి జపాలు ప్రారంభిస్తారు. ఈ నెల 21 వరకూ ఈ కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ శుక్రవారం తెలిపారు.

ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2023–24 సంవత్సరంలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరు కాని వారు సీటు పొందాలని తెలిపారు. మెరిట్ నంబర్ 1 నుంచి 583 వరకూ ఈ నెల 18వ తేదీ ఉదయం 8 గంటలకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

17, 18 తేదీల్లో పలు రైళ్ల రద్దు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడ డివిజన్‌లోని అనకాపల్లి – తాడి సెక్షన్‌లో జరుగుతున్న పనుల దృష్ట్యా 17, 18 తేదీల్లో జిల్లా మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఆ రోజుల్లో గుంటూరు – విశాఖపట్నం – గుంటూరు (17239/17240), మచిలీపట్నం – విశాఖపట్నం – మచిలీపట్నం (17219/17220), 17వ తేదీన విశాఖపట్నం – విజయవాడ – విశాఖపట్నం (22701/22702) రైళ్లను రద్దు చేసినట్టు వివరించారు.

ప్రకృతి హితమైన సాంకేతికతను ఆవిష్కరించాలి

- చిన్న జీయర్ స్వామి
- 'యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్'పై జేఎన్‌టీయూకేలో సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న చినజీయర్ స్వామి. చిత్రంలో వీసీ ప్రసాదరాజు తదితరులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రపంచానికి ప్రకృతి హితమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని జేఎన్‌టీయూకే విద్యార్థులకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి పిలుపునిచ్చారు. 'యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్' అనే అంశంపై జేఎన్‌టీయూకే అలుమ్నీ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థి డాక్టర్ కేఐ వరప్రసాద్‌రెడ్డి సామాన్యులకు వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకువచ్చారని, ఇదే స్ఫూర్తితో విద్యార్థులు కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని హితవు పలికారు. ఎవరి స్థాయిలో వారు తనతో పాటు తన వారి కోసం వీలైనంత మంచి చేస్తే అది కుటుంబానికి, సమాజానికి, దేశానికే కాకుండా ప్రకృతిలోని సమస్త ప్రాణికోటికీ మేలు చేస్తుందని చెప్పారు. జేఎన్‌టీయూకే ప్రగతిని ప్రశంసించారు. విద్యార్థులను, అధ్యాపకులను ఆలోచింపజేసే రీతిలో పలు అంశాలను వివరించారు. ఓజోను పొరకు పడిన రంధ్రం జీవరాశులపై, సాంకేతిక ప్రభావం ప్రకృతిపై తక్కువగా ఉండేలా చేయడం వంటి అంశాలపై చర్చించి, ఉత్తేజపరిచారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ, స్వామీజీ చెప్పిన విషయాలను అందరూ ఆచరించి వృద్ధిలోకి రావాలని అన్నారు. డీఏపీ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎల్.సుమలత, రెక్టార్ కేవీ రమణ, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పి.కృష్ణారావు, జీయర్ వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి

- అన్నవరం దేవస్థానం అధికారులకు చైర్మన్ రోహిత్ ఆదేశం
- ఈఓతో కలిసి పనుల పరిశీలన



శివసదన్ సత్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రోహిత్, ఈఓ అజాద్

అన్నవరం: వివిధ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసి, భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నవరం దేవస్థానం పాలక మండలి చైర్మన్ ఐవీ రోహిత్ ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. ఈఓ చంద్రశేఖర్ అజాద్‌తో కలసి వివిధ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. తొలుత సత్యగిరి ఎంట్రన్స్ పక్క నుంచి నిర్మిస్తున్న పార్కింగ్ స్థలం రోడ్డు పనులను పరిశీలించారు. ఇవి పూర్తయితే సుమారు 200 కార్లను ఇక్కడ నిలిపే అవకాశం ఉంటుందని ఈఓ వివరించారు. అనంతరం సత్యగిరి నుంచి వాహనాలు దిగువకు వెళ్లేందుకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ రోడ్డును రెండో ఘాట్ రోడ్డుకు కలిపితే బాగుంటుందని చైర్మన్ సూచించారు. అలా కాకుండా గిరి ప్రదక్షిణ రోడ్డుకు కలిపితే ఆ రోడ్డు ద్వారా అసాంఘిక శక్తులు రత్నగిరికి చేరుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. అటువంటి పరిస్థితి తలెత్తకుండా తగు భద్రత కల్పిస్తామని, అవసరమైతే టోల్‌గేట్ ఏర్పాటు చేస్తామని ఈఓ చెప్పారు. అలాగే, సత్యగిరిపై రూ.15 కోట్లతో నిర్మిస్తున్న 138 గదుల 'శివ సదన్ సత్రం' నిర్మాణ పనులను కూడా చైర్మన్, ఈఓ పరిశీలించారు. దీని నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సీఆర్ఓ కార్యాలయం పక్కన కేశఖండన శాల ఏర్పాటుకు చేపట్టిన స్థలం చదును పనులను పరిశీలించారు. సాయంత్రం గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఉన్న దేవస్థానం స్థలాన్ని కూడా చైర్మన్, ఈఓ పరిశీలించారు. ఈ స్థలంలో ఇటీవల పాతిన సరిహద్దు స్తంభాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ గుర్రాజు, ఇతర అధికారులు కూడా ఉన్నారు.